క్లుప్తంగా

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ మీరయ్య



పెదకూరపాడు: మండలంలోని గ్రామాల అభివృద్ధికి అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పని చేయాలని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మీరయ్య మాట్లాడుతూ వేసవి కాలం దృష్టిలో ఉంచుకొని తాగునీరు సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. మిర్చి ఆరుతడి పంటకు సాగు నీరు సకాలంలో అందించాలన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ షేక్ చాంద్ బాషా, ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు.

యోగాశ్రమంలో సంగీతోత్సవాలు ప్రారంభం



అమరావతి: కళావాహిని సంస్థ ఆధ్వర్యంలో సంగీతోత్సవాలు స్థానిక యోగాశ్రమంలో శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం సంగీత కళాశాలలో విద్యాభ్యాసం చేసి విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం, అమరావతి అమరేశ్వరస్వామి దేవస్థానం, అనంతవరం వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి సేవలలో పాల్గొనే నాదస్వర విద్యాంసులతో కచేరి నిర్వహించారు. అనంతరం అమరేశ్వర కూచిపూడి నాట్య అకాడమి విద్యార్థినుల నృత్య ప్రదర్శన, సంగీత కళాకారులు హరిశ్రీ, నవ్యశ్రీల లలిత గేయాలాపనలు సభికులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ధాన్యకటక బుద్ధ విహార ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ వావిలాల సుబ్బారావు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు చర్యలు

క్రోసూరు: నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన చిన్నారులకు ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు పీహెచ్‌సీ డాక్టర్ ధనుష్ శనివారం తెలిపారు. మండలంలోని అన్ని గ్రామపంచాయతీల పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో మొత్తం 14,642 మంది చిన్నారులకు, విద్యార్థులకు మాత్రలు వేసేందుకు సిద్ధం చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాలలోని చిన్నారులు 3054, అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కాలేజీల్లో 11,588 మంది విద్యార్థులకు మొత్తం 14,642 మందికి మాత్రలు వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్యకార్యకర్తలు, ఆశ, అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొని నులి పురుగుల నివారణ మాత్రలు వేయటం జరుగుతుందన్నారు. ఇంకా మిగిలిన వారికి ఈనెల 17 వ తేదీన మాత్రలు అందించనున్నట్లు చెప్పారు.

తూనికలు కొలతల అధికారి విస్తృత తనిఖీలు



క్రోసూరు: సత్తెనపల్లి తూనికల శాఖ అధికారి షేక్ జాన్ సైదా ఆధ్వర్యంలో గురు,శుక్ర వారాల్లో పలు దుకాణాలు, రేషన్ షాపులు, ఎండీయూ వాహనాలను తనిఖీ చేసి పలువురిపై శనివారం కేసు నమోదు చేశారు. కార్డుదారులకు రేషన్‌బియ్యం అందచేసే ఎండీయూ వాహనాల్లో ముద్ర లేని తునికల రాళ్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ జాన్ సైదా వివరించారు. పలు కూరగాయల దుకాణాలలో తనిఖీలు చేసి కేసులు పెట్టినట్లు చెప్పారు. తనిఖీల్లో మొత్తం 15 కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ వివరించారు. ఆయన వెంట వీఆర్వో పేరయ్య ఉన్నారు.

సరికొండపాలెంలో రీసర్వే

బొల్లాపల్లి: మండలంలో రీసర్వేలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా సరికొండపాలేన్ని ఎంపిక చేసినట్లు తహసీల్దార్ ఏవీ సుధాకర్ తెలిపారు. రీసర్వేను శనివారం పరిశీలించారు. రీసర్వేకు 4 బృందాలను ఏర్పాటు చేయడమైందని తెలిపారు. ఇందులో తొలిగా గ్రామసరిహద్దులు నిర్ణయించడం, ప్రభుత్వ భూములను గుర్తించడం, రైతులకు సంబంధించిన భూములను గుర్తించడం జరుగుతుందన్నారు. రైతు వారీ భూముల కొలతలు నమోదు చేసి ఎల్‌పీఎం నంబరు భూములకు కేటాయించడం జరుగుతుందని, ఆయా రైతులకు చెందిన భూములకు సరిహద్దు రాళ్ల ఏర్పాటు వేయనున్నట్లు తెలిపారు.

సంపద సృష్టి చెత్తే

- డంపింగ్ యార్డుకు చేరని చెత్త
- రోడ్ల వెంబడే పొగబెడుతున్నారు..
- పట్టించుకోని పంచాయతీ అధికారులు



చాగంటివారిపాలెం డంపింగ్‌యార్డులో తగలబెడుతున్న వ్యర్థాలు

ముప్పాళ్ల: చెత్తశుద్ధి కనిపించడం లేదు. ప్రభుత్వం స్వచ్ఛ సంకల్పం పేరుతో హడావుడి చేస్తోంది. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వ్యవస్థను నిర్వీర్యం చేసింది. దీంతో రోడ్ల వెంబడి చెత్తను డంప్ చేస్తున్నారు. అక్కడే పొగబెడుతున్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు.

మండలంలో చెత్త యార్డులు..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మండలంలోని మొత్తం 14 గ్రామపంచాయతీల్లోనూ డంపింగ్‌యార్డులు నిర్మించారు. ప్రతి వెయ్యి జనాభాకు ఒకరి చొప్పున క్లాప్‌మిత్రలను నియమించారు. వారితో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణ చేయించారు. కానీ కూటమి వచ్చిన తరువాత ఆ విధానానికి తూట్లు పొడిచారు.

ఎక్కడ చూసినా చెత్తే....

పలు గ్రామాల్లో రోడ్లు పక్కనే భారీ ఎత్తున చెత్త కుప్పలు కనిపిస్తున్నాయి. దాదాపు ప్రతి గ్రామంలోను నిర్మించిన చెత్త సంపద తయారీ కేంద్రాలు పనిచేయడం లేదు. కొన్ని గ్రామాల్లో జనావాసాలనుంచి చెత్త సేకరణే లేకుండా పోయింది. గ్రామస్తులే స్వచ్ఛందంగా గ్రామ చివరిన రోడ్ల వెంబడి పారవేసుకునే దుస్థితి. చెత్త సేకరణ చేసినా శివారు ప్రాంతంలో చెత్త వేసి నిప్పు పెట్టేస్తున్నారు. ఇళ్ల మధ్యే పొగ బెడుతుండటంతో పీల్చిన వృద్ధులు తీవ్ర అనారోగ్యం పాలవుతున్నారు. శ్వాసకోశ వ్యాధులతో పాటుగా, దీర్ఘకాలిక వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు.

పీబీసీ కాలువ కట్టే ...

పెదనందిపాడు బ్రాంచి కాలువ కట్ట మద్యం సీసాలు, ఖాళీ సిగరెట్టు పెట్టెలతో మినీ డంపింగ్ యార్డును తలపించేలా తయారైంది. కాలువ వెంబడే చెత్తను పోస్తుండటంతో కాల్వలోని నీరు కలుషితంగా మారనుంది. పాదలతో నిండి మరింత ప్రమాదకరంగా మారింది.

-మాదల గ్రామంలోనూ ప్రధాన రహదారి పక్కనే కొబ్బరి బోండాలు, గృహాల్లోని చెత్తను తరచూ వేస్తుండటంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతూ ఉంది. ప్రతి వారానికి ఒకసారి స్వచ్ఛతాహీసేవ కార్యక్రమంలో భాగంగా పొక్లెయిన్‌తో తాత్కాలికంగా తొలగింపు చర్యలు చేపడుతున్నా, మరుసటి రోజు అదే పరిస్థితి. రుద్రవరం వెళ్లే రహదారి, ఎస్సీ కాలనీ పక్కనే ఉన్న రహదారి వెంబడే చెత్తను పారబోస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందికరంగా తయారైంది.

మండల కేంద్రంలో ఇదీ పరిస్థితి..

మండల కేంద్రమైన ముప్పాళ్లలో సత్తెనపల్లి- నరసరావుపేట ప్రధానరహదారి పక్కనే చెత్త డంప్ చేస్తున్నారు. వారానికొకసారి తగలబెడుతుండటంతో రోడ్డంతా పొగకమ్ముకొని వాహనదారులు ఇబ్బందులతో పాటుగా తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే తురకపాలెం వెళ్లే దారిలోని శివాలయం, ఎంపీపీ ఉర్దూ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం పక్కనే పారవేస్తుండటంతో తీవ్ర దుర్గంధం వెదజల్లుతూ చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు వచ్చినప్పుడు కాలవల్లోని మురుగు పొంగి రోడ్లపైకి లోతట్టు ఇళ్లలోకి చేరుతుంది. కూడలిలోని నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది.

దుర్వాసన భరించలేకపోతున్నాం..

రోడ్ల వెంబడే చెత్త వేస్తున్నారు. తీవ్ర దుర్వాసనతో ఉండలేక పోతున్నాం. దీనికి తోడు చెత్తకు మంట పెడుతుండటంతో పొగతో ఊపిరి ఆడటం లేదు. వృద్ధులు, పిల్లలు నానా ఇబ్బందులు పడుతున్నారు. చెత్తను డంపింగ్‌యార్డుకు తరలించాలి.

-ఖాశింబి, ముప్పాళ్ల

వ్యర్థాలను తరలించేలా చర్యలు

ఇళ్లలోని వ్యర్థాలను రిక్షాల ద్వారా తరలించేందుకు చర్యలు చేపట్టాం. డంపింగ్ యార్డులు అందుబాటులోకి తెచ్చి సంపద కేంద్రాలుగా తయారు చేస్తాం. రోడ్ల వెంబడి చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం.

-ఎస్.రూపవతి, ఈఓపీఆర్డీ

అసాంఘిక చర్యలకు కేంద్రాలుగా చెత్త కేంద్రాలు...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మంగా గ్రామాల్లో చెత్తను సేకరించి చెత్త సంపద కేంద్రాలకు తరలించేలా సిబ్బందిని ఏర్పాటు చేసి అమలు చేసింది. అందుకు అవసరమైన చెత్త సంపద కేంద్రాలను నిర్మించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి చెత్త సంపద కేంద్రాలు అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. రాత్రి, పగలు తేడా లేకుండా యథేచ్ఛగా మందుబాబులకు అడ్డాగా మారిపోయాయి.



నిరుపయోగంగా మారిన చాగంటివారిపాలెం డంపింగ్‌యార్డు

నేడు పెదమక్కెనలో వైద్య శిబిరం

సత్తెనపల్లి: పెదమక్కెనలో ఉచిత వైద్యశిబిరం ఆదివారం నిర్వహించనున్నారు. వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ఆధ్వర్యంలో గజ్జల నారాయణమ్మ చారిటబుల్ ట్రస్ట్ సౌజన్యంతో సత్తెనపల్లి మండలం మండలం పెదమక్కెనలోని పోలేరమ్మ తల్లి అమ్మవారి దేవాలయం వద్ద నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శనివారం తెలిపారు. శిబిరాన్ని నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్ రెడ్డి ప్రారంభించనుండగా ముఖ్యఅతిథిగా రాష్ట్ర మాజీ మంత్రి అంబటి రాంబాబు హాజరవు తారన్నారు.

కార్యకర్తల మృతి పార్టీకి తీరనిలోటు



రాజుపాలెం: కార్యకర్తల అకాల మృతి పార్టీకి తీరనిలోటని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి అన్నారు. మండలంలోని కోటనెమలిపురికి చెందిన సానికొమ్ము సుబ్బారెడ్డి, దేవిరెడ్డి శ్రీనివాసరెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఆయన, శనివారం గ్రామానికి చేరుకొని మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యకర్తలకు, ఆపదలో ఉన్న వారి కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సునీతా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మట్కాతో.. జీవితాలు బుగ్గి

- సత్తెనపల్లిలో యథేచ్ఛగా ఆట
- నరసరావుపేట నుంచి సత్తెనపల్లికి పాకిన వైనం
- చోద్యం చూస్తున్న పోలీసులు



సత్తెనపల్లిలో బహిరంగంగానే సింగిల్ నంబర్ రాసి ఇస్తున్న ఏజెంట్

సత్తెనపల్లి: మట్కా మహమ్మారి ఉచ్చులో చిక్కుకొని సామాన్య, మధ్య తరగతి వర్గాల ప్రజలు జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. ఒక్క సారి దాంట్లో ఇరుక్కుంటే ఆస్తులను కోల్పోయి కుటుంబాలు చిన్నాభిన్నం కావాల్సిందే. ఒకప్పుడు కేవలం జిల్లా కేంద్రం నరసరావుపేటకే పరిమితమైన మట్కా ప్రస్తుతం జిల్లా ముఖద్వారమైన సత్తెనపల్లికి పాకింది.

నిఘా ఏది..?

డివిజన్‌లోని సత్తెనపల్లి పట్టణంలో మట్కా యథేచ్ఛగా సాగుతోంది. మట్కా నిర్వాహకులు ఆడే వారిని సెల్‌ఫోన్ ద్వారా సంప్రదించి కాగితాలపై రాస్తూ ఆడిస్తున్నారు. ఒక్క సారి మట్కా తగిలితే ఆశతో చిరు వ్యాపారులు, తోపుడుబండ్ల విక్రయాలు సాగించే వ్యాపారులు, పేదల కాలనీలో కొంతమంది ఆట బారిన పడుతున్నారు. కొంత మంది రాజకీయ నాయకులు మట్కా రాయుళ్లతో సంబంధాలు నెరుపుతూ డబ్బులు దండుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు సరైన నిఘా పెట్టడం లేదనే విమర్శలు ఉన్నాయి.

పట్టణంలో ఇలా..

పట్టణంలో 15 నుంచి 20 మంది వరకు ఏజెంట్లు మట్కా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఏజెంట్ కొంతమందిని పెట్టుకుని రోజుకు రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకు వసూలు చేస్తున్నట్లు సమాచారం. మహమ్మారిపై ఉక్కు పాదం మోపాలని ప్రజలు కోరుతున్నారు.

సత్తెనపల్లిలో ఎక్కడెక్కడ...

రెవెన్యూ డివిజన్ కేంద్రమైన సత్తెనపల్లిని ప్రధాన కూడళ్లు, మారుమూల కాలనీలో మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం. సత్తెనపల్లిలో బహిరంగంగానే రోడ్లపై కూర్చొని విక్రయాలు చేస్తున్నారు. ప్రధానంగా గార్లపాడు సెంటర్, పాత బస్టాండ్, మార్కెట్ ఏరియా, ఎన్టీఆర్ కాంప్లెక్స్, రైల్వే స్టేషన్ రోడ్, ఐదులాంతర్ల సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్లలో రోజు మట్కా నిర్వహిస్తున్నట్లు సమాచారం.

పూర్తి స్థాయిలో దృష్టి పెడతాం

మట్కా నిర్వహణపై పరిశీలించి, పూర్తి స్థాయిలో దృష్టి పెడతాం. ఇప్పటికే లాటరీ టికెట్ల నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేశాం. నిషేధిత జూదాలు జరుగు తుంటే ప్రజలు సమాచారం అందించి సహకరించాలి.

-బి.బ్రహ్మయ్య, సీఐ, సత్తెనపల్లి టౌన్

మెరుగైన విద్యాబోధనకు ప్రాధాన్యమివ్వాలి

పిడుగురాళ్ల: ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు మెరుగైన విద్యా బోధనకు ప్రాధాన్యత నివ్వాలని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సూచించారు. పట్టణంలోని జానపాడు రోడ్డులో గల శుభమస్తు కల్యాణ మండపంలో శనివారం ప్రైవేట్ పాఠశాలల డైరెక్టర్ల ఆత్మీయ సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యరపతినేని పాల్గొని, మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు కూడా అవకాశాలు కల్పించి మెరుగైన విద్యనందించేలా యాజమాన్యాలు కృషి చేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావును డైరెక్టర్లు గజమాలతో సత్కరించారు. కూటమి నాయకులు, పాఠశాల యాజమాన్యాలు పాల్గొన్నారు.

ఘనంగా భీష్మ ఏకాదశి వేడుకలు

విజయపురిసౌత్: భీష్మ ఏకాదశి వేడుకలను విజయపురిసౌత్ లోని శ్రీ సీతారామాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు.ఆలయ అర్చకులు గుడిపూడి బ్రహ్మాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం నుంచే స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.అష్టోత్తర శతనామావలి, విష్ణు సహస్రనామం తదితర పూజలు నిర్వహించారు. ప్రపన్న గోష్ఠి సభ్యుల చేత విష్ణు సహస్ర పారాయణం జరిగింది.అనంతరం మంత్ర పుష్పం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. భీష్మ ఏకాదశి సందర్భంగా భారీగా భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

సాతులూరులో ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు



నాదెండ్ల: సాతులూరు గ్రామంలో కొలువై యున్న గ్రామ దేవతల ఆలయాల తొమ్మిదో వార్షికోత్సవం శనివారంతో ముగిసింది. గత నెల 31న ప్రారంభమైన వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఐదు రోజుల పాటూ ఘటం కుండ ఊరేగింపు నిర్వహించారు. 5వ తేదీన వసంతోత్సవం నిర్వహించారు. 6వ తేదీన పొంగళ్లు పొంగించి నైవేద్యాలు సమర్పించారు. అదేరోజు అన్నదానం చేశారు. 7వ తేదీ మొక్కుబడులు తీర్చుకున్నారు. 8వ తేదీన గ్రామ పురవీధుల్లో సిడిమానోత్సవం వైభవంగా నిర్వహించారు. గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. సాంప్రదాయబద్ధమైన మేళతాళాలతో స్వామి వారిని ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలంకరణ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

గ్రాడ్యుయేట్‌లందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

నకరికల్లు: రాబోవు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గ్రాడ్యుయేట్‌లందరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పిలుపునిచ్చారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజాకు మద్దతుగా రోజుకు 30-40 మంది ఓటర్లను కలిసి ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగోతు శౌరయ్య, జెడ్పీటీసీ సభ్యుడు జూనెబోయిన హరీష్, అల్లీబాషా, సాగి శ్రీనివాసరావు, ఇర్లా శ్రీహరి, గుజ్జుల పోలు, వెంకటాంజనేయులు, పాలాంజి పాల్గొన్నారు.

ముమ్మరంగా సత్రశాలలో శివరాత్రి ఏర్పాట్లు


వలంటరీ సేవలకు దేవస్థానం ఆహ్వానం



శివరాత్రికి ముస్తాబు చేస్తున్న సత్రశాల దేవస్థానం

సత్రశాల(రెంటచింతల): ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న సత్రశాల శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో ఫిబ్రవరి 26 న జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. అతిపురాతనమైన శైవక్షేత్రంగా ప్రసిద్ధి చెందిన ఈ దేవస్థానానికి రాష్ట్రంలోనే ఒక ప్రత్యేక స్థానం ఉంది. శివరాత్రి సందర్భంగా తరలి వచ్చే వేలాది మంది భక్తులకు ఏలాంటి ఇబ్బందులు పడకుండా స్వామివారి దర్శనం చేసుకునే విధంగా బారికేట్లు, మంచినీటి సదుపాయం, పార్కింగ్, మహిళలు స్నానాలు చేసేందుకు కృష్ణానది వద్ద వసతి, విద్యుత్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం కమిటీ సభ్యులు, పరాశక్తి సిమెంట్ ప్యాక్టరీ యాజమాన్యం, ఏపీ జెన్‌కో నాగార్జున సాగర్ టైయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టు, వివిధ శాఖాధికారుల సహాయ సహకారాలతో భక్తులకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నూరు శాతం కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎంతో పవిత్రమైన మహాశివరాత్రి పర్వదినాన రెండు తెలుగు రాష్ట్రాలలోని అనేక ప్రాంతాలకు చెందిన వేలాది మంది భక్తులు రాష్ట్రంలోనే అతిపురాతనమైన మల్లికార్జునస్వామి దర్శనం చేసుకునేందుకు ఇక్కడకు వస్తారు. భక్తులకు సేవ చేయడానికి మంచి మనస్సుతో యువతియువకులు వాలంటీర్లుగా విధులు నిర్వహించడానికి ముందుకు రావాలని నిర్వాహకులు కోరారు. ఆసక్తి కలిగిన 99496 46208 నంబరుకు సంప్రదించాలని కోరారు.

10 నుంచి జగన్నాథస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



ముప్పాళ్ల: మండలంలోని చాగంటివారిపాలెంలోని సుభద్ర బలభద్ర సహిత జగన్నాథస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 10వ తేదీ నుంచి 14 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. 10వ తేదీన స్వామికి పంచామృత అభిషేకం, స్వామిని పెళ్లి కుమారుని చేయుట, గరుడ ధ్వజారోహణ, 11న భగవద్గీత పారాయణం, సాయంత్రం శ్రీరాధాకృష్ణుల కళ్యాణం, 12న విష్ణుసహస్రపారాయణం, గరుడ వాహన ఊరేగింపు, కోలాటం, 13న వసంతోత్సవం, 14న పూర్ణాహుతి, అన్నదానం కార్యక్రమం జరుగుతుందన్నారు. అధిక సంఖ్యలో కళ్యాణోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

రైతులను నిలువునా ముంచిన కూటమి ప్రభుత్వం



జెడ్పీటీసీ సభ్యుడు శెట్టిపల్లి యలమంద

దుర్గి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమమే తమ ధ్యేయమని కల్లబొల్లి మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి రైతాంగాన్ని నిలువునా ముంచాయని దుర్గి జెడ్పీటీసీ సభ్యులు శెట్టిపల్లి యలమంద అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటలైన మిర్చి, కంది ధరలు పడిపోవటంతో రైతాంగం తీవ్ర ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. తమకు ఆత్మహత్యలే శరణ్యమని దిక్కుతోచని స్థితిలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సూపర్ సిక్స్ అంటూ కూటమి ప్రభుత్వం అబద్ధపు వాగ్దానాలు చెప్పి అధికారంలోకి వచ్చాక రైతాంగం సమస్యలను గాలికొదిలేశారని మండిపడ్డారు. క్వింటాకు రూ.7,550 మద్దతు ధర ప్రకటించి నేటికీ మార్క్ ఫెడ్ ఒక్క గింజ కూడా కొనుగోలు చేయలేదని విమర్శించారు. ముటుకూరులో ఏర్పాటు చేసిన మార్క్ ఫెడ్ ద్వారా నేటికీ కొనుగోలుకు జరపడం లేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా రూ. 10వేలకు పైగా క్వింటా కొనుగోలు చేసినట్లు గుర్తుచేశారు. అదే విధంగా మిర్చిలో తేజ రకం రూ.20 వేలకు పైగా వైఎస్సార్ సీపీ హయంలో విక్రయాలు జరిగితే, నేడు క్వింటా కేవలం రూ.10 వేలకు పడిపోయిందన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

గురజాల : మనస్తాపం చెందిన వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన గురజాలలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాల మేరకు.. గురజాల పట్టణానికి చెందిన బి.ఈశ్వరి (44) శ్రీరాంపురం రోడ్డులో నివాసం ఉంటోంది. ఆమె భర్త గత కొన్నేళ్ల క్రితం మృతిచెందాడు. రెండేళ్ల క్రితం పెద్ద కుమారుడు ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఇద్దరి మృతితో ఈశ్వరి కుమిలిపోతూ ఉండేది. ఇదే క్రమంలో మధ్యాహ్నం ఇంటి తలుపులు వేసుకుని ఉరి వేసుకుంది. గమనించిన చిన్న కుమారుడు నవీన్ స్థానికులు సాయంతో తల్లిని గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించాడు. వైద్యులు పరిక్షించి ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైద్యశాల మార్చురీకి తరలించారు. కుమారుడు నవీన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

తిరునాళ్లలో భక్తులకు అసౌకర్యం కలుగనీయం

కోటప్పకొండలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి, ఎంపీ, ఎమ్మెల్యేలు



మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర విద్యుత్ శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కోటప్పకొండలో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట, చిలకలూరిపేట ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబులతో కలిసి పర్యటించారు. ఈసందర్భంగా త్రికోటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం కొండపై జరుగుతున్న పనులను పరిశీలించారు. చేయాల్సిన ఏర్పాట్లపై ఈఓ చంద్రశేఖర్‌తో చర్చించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చేయాలనే సంకల్పంతో తిరునాళ్లను నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్ర పండగ అయినందున కావాల్సిన నిధులు విడుదల చేస్తామని, కొండపై పారిశుద్ధ్య నిర్వహణ, భక్తులకు త్వరగా దర్శనం చేసేందుకు కావాల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. సంబంధిత శాఖకు చెందిన మంత్రితో మళ్లీ కొండకు వస్తామని పేర్కొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేస్తాం: ఈఓ

ఈనెల 26న మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కోటప్పకొండకు వచ్చే భక్తుల సౌకర్యా ర్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఈఓ చంద్రశేఖర్ వెల్లడించారు. శనివారం కొండపై కార్యాలయంలో తనను కలిసిన మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. భక్తులు ప్రశాంతంగా దర్శనం చేసుకునేలా అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు ఏర్పాట్లు పరిశీలించి తగిన సూచనలు చేశారని వివరించారు.

బైపాసుకి రిటైనింగ్ వాల్



యడ్లపాడు: మండలం పరిధిలోని తిమ్మాపురం చేపల చెరువు సమీపంలో ప్రారంభం అయ్యే బైపాస్ రహదారి రిటైలింగ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. తిమ్మాపురం నుంచి రూరల్ మండలం రామచంద్రాపురం డొంక వరకు 16.384 కి.మీ మేర సుమారు రూ.954 కోట్లతో నిర్మించిన ఈ బైపాస్ రహదారిని గతేడాది డిసెంబర్ 5వ తేదీన అమరావతి పీఐయూ ఎన్‌హెచ్ పీడీ పార్వతీశం ప్రారంభించి ట్రాఫిక్‌ను వదిలిన విషయం తెలిసిందే. బైపాస్‌కు సంబంధించి అన్ని మేజర్ పనులు పూర్తి చేసినప్పటికీ ఇంకా కొన్ని పనులు ఉన్నా యి. వీటిలో భాగంగా తిమ్మాపురం హైవే వంతెన సర్వీసు మార్గంలో ఆధునీకరణ పనులు జరుగుతున్నాయి. తారురోడ్డు ఎత్తు అధికంగా ఉన్నందున మట్టి జారకుండా ఉండేందుకు నాపరాళ్లతో రిటైనింగ్ వాల్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా పనులు శరవేగంగా చేస్తున్నట్లు హైవే సిబ్బంది తెలిపారు.